

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లో జాయింట్ ఎల్పిఎంల కారణంగా ప్రభుత్వ పథకాలను పొందడంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టిందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖ సబ్ డివిజన్ సేవ కోసం నిర్ణయించిన రూ.500 రుసుము మినహాయింపు ఇచ్చి కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50 చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకున్నవారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.

'పెనుగొండ ప్రాంతానికి చెందిన రామకృష్ణ కుమార్తె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లికి వందనం ఆగిపోయింది. అదేమని అడిగితే 300 యూనిట్లు విద్యుత్ వాడకం ఉందని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారుల వద్దకు వెళ్తే ఏడాది సరాసరి చూసినా ఆ కుటుంబానికి 300 యూనిట్లు కంటే బాగా తక్కువగానే ఉంది. ఆ శాఖ అధికారుల నుంచి లేఖ తెచ్చి సచివాలయంలో ఇచ్చారు. తల్లికి వందనం ఇస్తారో లేదోననే అనుమానం ఆ కుటుంబంలో నెలకొంది.'

'ఏలూరుకు చెందిన సత్యనారాయణ కుమార్తె ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. తల్లికి వందనం రాలేదు. అదేమని సచివాలయానికి వెళ్తే నాలుగు చక్రాల వాహనం ఉందని చెబుతున్నారు. తనకు కారు లేదని, ఐదేళ్ల క్రితం విక్రయించానని లబోదిబోమంటున్నాడు. రవాణాశాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి అన్ని పత్రాలు సమర్పించినా తల్లికి వందనం వస్తుందో, లేదోననే ఆందోళన నెలకొంది.'

తల్లికి వందనం అందేనా..?

- పథకం అమలులో ముప్పతిప్పలు
- సంబంధం లేని కారణాలతో అనర్హుల జాబితాలోకి
- రెండు జిల్లాల్లో దాదాపు లక్షకుపైగా విద్యార్థులకు అందని సొమ్ము
- కరెంటు బిల్లులు, వాహనాలు, భూముల తప్పిదాలే ఎక్కువ
- అధికారులు, సచివాలయాల చుట్టూ తల్లిదండ్రులు ప్రదక్షిణలు
- పోస్టాఫీసు ఖాతాలో జమైన సొమ్ము తీసుకోలేని దుస్థితి



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఇద్దరు బాధితులే కాదు. రెండు జిల్లాల్లో లక్షకుపైగా విద్యార్థుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన తల్లికి వందనం పథకం సొమ్ము రాక తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. అర్హతున్న విద్యార్థులను సైతం అనర్హత జాబితాలో చేర్చడంతో గ్రామ, వార్డు సచివాలయాలు, సంబంధిత శాఖల అధికారుల చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. అసలు ఆ కుటుంబాలకు సంబంధం లేని కారణాలను చూపి తల్లికి వందనం నిలుపుదల చేయడంతో రెండు జిల్లాల్లో లక్షకుపైగా కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. ఇంతా తిరిగి పత్రాలు సమర్పించాకైనా తమకు తల్లికి వందనం వస్తుందా అనే అనుమానాలు అందరిలోనూ నెలకొన్నాయి. కుటుంబంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకూ చదివే విద్యార్థులందరికీ తల్లికి వందనం అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. హామీ ఇచ్చినట్లుగా పథకం అమల్లోకి తెచ్చినా అర్హతున్న చాలామంది విద్యార్థులను అనర్హుల జాబితాలోకి నెట్టేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అనర్హత జాబితాలో ఉన్నవారంతా సంబంధిత పత్రాలను సచివాలయాల్లో అప్పగించాలని ఈ నెల 20వ తేదీ వరకూ గడువు ఇచ్చింది. శుక్రవారంతో గడువు ముగిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,76,574 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తేల్చారు. మొత్తం 1,16,182 మంది తల్లులకు సంబంధించిన పిల్లలు జాబితాలో ఉన్నారు. ఇంకా 29,323 తల్లులకు చెందిన 41,703 మంది విద్యార్థులను అనర్హత జాబితాలో చేర్చారు. ఏలూరు జిల్లాలో మొత్తం 2,15,082 మంది విద్యార్థులు అర్హత సాధించగా, ఇందులో దాదాపు 60 వేల మందికిపైగా విద్యార్థులను అనర్హుల జాబితాలోకి చేర్చారు. దీంతో రెండు జిల్లాల్లో లక్షకుపైగా విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము జమ కాలేదు. అనర్హుల జాబితాలోకి చేర్చిన విద్యార్థులకు చూపిన కారణాలు సైతం అత్యంత దారుణంగా ఉన్నాయి. అనర్హత జాబితాలోకి చేరిన వారిలో ఎక్కువ మంది 300 యూనిట్లు కరెంటు బిల్లు దాటిన కుటుంబాలుగా చూపించారు. వాస్తవానికి 300 యూనిట్లుపైగా విద్యుత్ వాడకుంటున్నట్లు చూపిన వారిలో 90 శాతం కుటుంబాలు అంతకు తక్కువగానే వాడుకున్నట్లు ఉన్నాయి. దీంతో విద్యుత్ శాఖాధికారుల చుట్టూ తిరిగి తమకు అంత కరెంటు వాడకంలేదంటూ లేఖలు తీసుకువెళ్ళాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక సచివాలయంలో 50 మంది అనర్హత జాబితాలో ఉంటే 40 మంది విద్యుత్ బిల్లుల సమస్యలే కారణంగా ఉన్నారు. నాలుగు చక్రాల వాహనం ఉన్నట్లు చూపించిన వారిది ఇదే పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడో తమ పేరున కారు ఉండి అది విక్రయించి ఏళ్ల గడుస్తున్నా ఆపేశారు. రవాణాశాఖ అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వర్ పనిచేయడం లేదంటూ ఒకటికి, రెండుసార్లు తిరగాల్సి వస్తోంది. భూములు లేనివారికి భూములు ఉన్నట్లు చూపి అనర్హత జాబితాలోకి చేర్చేశారు. దీంతో తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. పిల్లలను తీసుకుని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారిపోతున్నారు. ఇంత కష్టపడి తిరిగి అన్ని పత్రాలు సమర్పించినా తల్లికి వందనం అందుతుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. తనకు కారు లేదని జిల్లా రవాణాశాఖ అధికారుల పత్రం ఇచ్చినా రాష్ట్రస్థాయిలోని రవాణా వెబ్‌సైట్‌లో మాత్రం కారు ఉన్నట్లుగానే చూపిస్తోంది. విద్యుత్ బిల్లులకు సంబంధించి సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. సచివాలయాల్లో గురు, శుక్రవారాల్లో గ్రీవెన్స్ నమోదు చేసి వివరాలు పంపించారు. ఇందులో ఎంతమంది అర్హత జాబితాలో ఉంటారో తెలియక అంతా తీవ్ర టెన్షన్‌లో ఉన్నారు.

పోస్టాఫీసుల్లో జమైన సొమ్ము కోసం అవస్థలు

బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ లింకు చేయించుకునేందుకు వెళ్లిన తల్లులకు, అక్కడి అధికారులు రూ.200 తీసుకుని పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఇప్పుడు చాలామంది విద్యార్థులకు సంబంధించిన తల్లికి వందనం సొమ్ము పోస్టల్ అకౌంట్లలో జమయ్యాయి. ఆ సొమ్ము తీసుకునేందుకు వెళ్లగా సొమ్ములు సరిపడా లేవు.. తర్వాత ఇస్తామంటూ చెబుతున్న పరిస్థితి ఉంది. దీంతో తల్లులు సొమ్ము కోసం పోస్టాఫీసుల వద్ద క్యూ కడుతున్నారు. దీంతో తల్లికి వందనం అమలు తీరుపై జనంలో తీవ్ర చర్చ సాగుతోంది. తమకు సంబంధం లేని కారణాలు చూపి అనర్హత జాబితాలో పెట్టి, తిప్పించడంపై తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన


పోలీస్ ఐలాండ్ వద్ద నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై నెలల తరబడి యుద్ధం చేస్తోందని, ఇప్పటికి వరకూ సుమారు 60 వేల మంది చనిపోయారని వీరిలో పసి పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎక్కువగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలోని ఒక ప్రదేశంలో శరణార్థులు శిబిరాలు ఏర్పాటు చేసి వారికి తినడానికి తిండి లేకుండా, తాగడానికి నీళ్లు లేకుండా, వైద్య సహాయం లేకుండా నిర్బంధిస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ యుద్ధాల వల్ల దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం యుద్ధాన్ని ఆపడానికి తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ జిలానీ, షేక్ అబ్దుల్లా, జవ్వాది శ్రీను, మడకా రాజు, శిద్దిరెడ్డి శేషుబాబు, యండమూరి నాగేంద్ర, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం అమ్మి రోజులు గడుస్తున్నా బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమని, తక్షణం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావుతో కలిసి గోపాలన్ శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు బాగా పండించారన్నారు. గతం కంటే దిగుబడి పెరిగిందన్నారు. ప్రభుత్వం మాత్రం పండించిన పంటకు రైతులకు ధాన్యం డబ్బులు చెల్లించకుండా జాప్యం చేయడంతో రైతుల చేతుల్లో డబ్బుల్లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సార్వా ప్రారంభమైందని విత్తనాల కొనుగోలుకు చేతుల్లో డబ్బుల్లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఒక పక్క దాళ్వా సాగుకు అప్పుచేసి పంటలు పండించిన రైతుకు ధాన్యం డబ్బులు పడకపోవడంతో సార్వాకు కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోవడానికి కారణం ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించకపోవడమే అని తెలిపారు. ప్రతి గింజా కొని వెంటనే రైతుల అకౌంట్లకు డబ్బులు వేస్తామని చెప్పి రూ.293 కోట్లు చెల్లించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. వెంటనే డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో 8.80 లక్షల మందితో యోగా

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 8 లక్షల 80 వేల మంది యోగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని, వారంతా 4,835 ప్రదేశాల్లో యోగా కార్యక్రమాల్లో పాల్గొనున్నారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించే యోగా కార్యక్రమాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టర్ నాగరాని కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో గూగుల్ మీట్ నిర్వహించారు. విశాఖపట్టణంలో ప్రధాని శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకూ యోగా కార్యక్రమంలో పాల్గొంటారని, అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు ప్రారంభమయ్యే విధంగా సన్నద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో 5 వేల మందితో నిర్వహించే యోగా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. రోప్ స్కిప్పింగ్, మల్కంబం వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డిఇఒ నారాయణకు సూచించారు. జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి బి.ఉమామహేశ్వరరావు, డిఇఒ ఆఫీస్ ఎడి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలి

పని గంటల పెంపునకు వ్యతిరేకంగా సిఐటియు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు


తణుకులో ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను పూర్తిగా రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఉద్యోగ కార్మిక సంఘాల నేతల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ పని గంటల పెంపు, మహిళలు రాత్రి సమయాల్లో పనులు చేయడానికి అంగీకరిస్తూ తీసుకున్న నిర్ణయాలు కార్మికులకు, మహిళా కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించేవిగా ఉన్నాయన్నారు. కనీసం ఈ విషయాలను పరిశీలించకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా పని గంటల పెంపునకు అంగీకరించడం, రాత్రి సమయాల్లో మహిళలు డ్యూటీ చేసే విధంగా అనుమతించడం దారుణమన్నారు. మహిళా కార్మికులు, ఉద్యోగులు ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతున్నారని, దాడులకు గురవుతున్నారని వారికి రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు విఫలమవుతున్నారన్నారు. ఎఐటియుసి నాయకులు సిహెచ్.రంగారావు, టియుసిసి నాయకులు దండు శ్రీనివాసరాజు మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, కలిపిండి సత్యనారాయణ, బంగారు వరలక్ష్మి, నీలాపు రాజు ఎఐటియుసి నాయకులు లక్ష్మీపతి పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు పని గంటల పెంపు జిఒను వెనక్కి తీసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు కోరారు. జిఒలను వ్యతిరేకిస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో పని గంటలు పెంపు, స్త్రీలు రాత్రి విధులు చేయడం వంటి నిర్ణయాలు మంత్రి వర్గం చేసి జిఒలు ఇచ్చిందని ఇది సరికాదని తెలిపారు. సిఐటియు నేతలు దేవ సుధాకర్, తడి వెంకటేష్, పెచ్చెట్టి సత్యనారాయణ, మల్లుల ప్రసాద్, సత్తింశెట్టి పురుషోత్తం, రెడ్డి అప్పారావు పాల్గొన్నారు.

తణుకు : రాష్ట్ర మంత్రి వర్గం కార్మికుల పని గంటలు ఎనిమిది నుంచి పది గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, భీమారావు మాట్లాడుతూ పది గంటల పని చేయాలనడం, రాత్రి సమయాల్లో మహిళలు విధులు నిర్వర్తించాలనడం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. అడ్డగర్ల అజయకుమారి, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరరావు, హర్షవర్ధన్, బ్రహ్మాజీ, త్రిమూర్తులు, అయ్యప్ప, నాగేంద్రకుమార్, కనకదుర్గ, కేతా శ్రీను, గోవిందరాజు, రాణి, అనంతలక్ష్మి, మందులయ్య, కేశవరావు, మధుశీల, బొద్దాని నాగరాజు, కె.రవికుమార్, గిద్దా అన్నపూర్ణ, మార్లపూడి బర్న, బోడపాటి నారాయణ పాల్గొన్నారు.

కాళ్ల: కార్మికులు త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ తెలిపారు. కాళ్లలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి మండ సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్ల పేరుతో దేశంలో, రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్యను పెంచుతూ కార్పొరేట్లకు దాసోహం చేస్తున్నాయని విమర్శించారు. ఇర్రింకి ఏడుకొండలు, గండికోట వెంకటేశ్వరరావు, బొదనపు శ్రీను బాలాజీ, తిరుమాని శ్రీను పాల్గొన్నారు.



భీమవరంలో ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

ఉండి : కార్మికులకు పెంచిన పని గంటలను వెంటనే సవరించాలని సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస ఆధ్వర్యంలో ఉండి మెయిన్ సెంటర్లో కార్మికులు నిరసన తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. కార్మికులపై పని భారం తగ్గించేలా ఉత్తర్వులను రద్దు చేయాలని లేని పక్షంలో కార్మికులను ఏకం చేసి పోరాడుతామని హెచ్చరించారు నాయకులు కింతాడ రమేష్, కడలి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, కంది గణపతి పాల్గొన్నారు.

మొగల్తూరు : కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న మొండి వైఖరిని వెంటనే విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న పని దోపిడీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే నెల 9వ తేదీన చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు వీర పాండురంగారావు, జి.పెద్దింట్లు, పి.లక్ష్మీ మంగామని, కె.కామాక్షి, శ్వేత, పి.బేబి, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి చేయూత

స్వగ్రామం గమళ్లపేటలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - యలమంచిలి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌ఎ బి.గోపీమూర్తి తన స్వగ్రామం యలమంచిలి మండలం నార్నిమెరక గ్రామ పరిధిలోని గమళ్లపేటలో సోమవారం 70 మంది పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందించి మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గమళ్లపేట అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభకు యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పి.క్రాంతి కుమార్ అధ్యక్షత వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా నిరాటంకంగా తన స్వగ్రామంలో చదువుతున్న పదో తరగతిలోపు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు ఇతర విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ తాను సమాజం నుంచి ఎన్నో వనరులు సేవలు చైతన్యాన్ని పొందానని తిరిగి మెరుగైన సమాజాభివృద్ధికి తనవంతు ప్రయత్నంగా 18 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్నిమెరక యువ నాయకులు వలవల విష్ణు బాలాజీ, యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.రామ్మూర్తి నాయుడు, కోశాధికారి వి.సందీప్‌కుమార్, ఆఫీస్ బేరర్స్ జెఆర్‌వి.నాగేశ్వరరావు, ఎం.బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మా స్కూల్ మాకు కావాలి

ఎల్ఇ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

సమస్యను పరిష్కరించాలని ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మా స్కూల్ మాకు కావాలి అంటూ మూడు రోజులుగా పెనుమంట్ర పెద్ద చర్చి రోడ్డులో ఉన్న మండల పరిషత్ ఎల్ఇ ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేస్తున్న విషయం విదితమే. శుక్రవారం కూడా స్కూల్ వద్ద బైఠాయించి ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న మెయిన్ పాఠశాలకు తమకు తెలియకుండా ఈ పాఠశాల నుండి 3, 4, 5 తరగతులకు చెందిన 24 మంది విద్యార్థులను తరలించారని తెలిపారు. వారు అంతదూరం బాగులు మోసుకుంటూ నడవలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఇ పాఠశాల నుంచి మెయిన్ పాఠశాలకు వెళ్లే దారి కోడేరు -తాడేపల్లిగూడెం రాష్ట్ర రహదారి కావడం వల్ల వచ్చే, పోయే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మెయిన్ స్కూల్ వద్ద పెన్సింగ్ చెరువు ఉండడం తమకు భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పిల్లలకు ఇంటి నుంచే భోజనం..

ఎల్ఇ స్కూల్లో ప్రస్తుతం 1, 2 తరగతులకు సంబంధించి ఆరుగురు పిల్లలు మాత్రమే ఉన్నారు. అయితే వారి తల్లిదండ్రులు ఇంటి నుంచే భోజనం తెస్తున్నారు. అయితే మెయిన్ స్కూల్‌కు వెళ్లిన 24 మంది పిల్లలకు అక్కడే మధ్యాహ్న భోజనం పెడుతున్నారు.

ఏకపక్షంగా విలీనం చేయడం తగదు.. ★★★

సర్పంచి తాడిపర్తి ప్రియాంక, పెనుమంట్ర



పెనుమంట్ర ఎల్ఇ స్కూల్ విద్యా కమిటీ తీర్మానంలో విలీనం సంగతి చెప్పకుండా సంతకాలు తీసుకొని, ఇక్కడ చదువుతున్న 3, 4, 5 తరగతులకు చెందిన 24 మంది పిల్లలను మెయిన్ పాఠశాలకు పంపడం తగదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి నాడు - నేడు పథకంలో నిర్మించిన స్కూల్ కేవలం 1, 2 తరగతులు చదువుతున్న ఆరుగురు పిల్లలకు పరిమితమైంది. ఎస్‌సి, బిసి ఏరియాల్లోని స్కూళ్లలో పిల్లల్ని ఇలా విలీనం పేరిట తరలించడం తగదు.

అంత దూరం నడవలేక పోతున్నారు.. ★★★

జాలెం రాణి, విద్యార్థి సింధు తల్లి



లక్షలతో కొత్తగా భవనం నిర్మించారు. ఆ ఆనందం లేకుండా మా పిల్లల్ని దూరంగా ఉన్న స్కూల్‌కు తరలించారు. అంత దూరం పిల్లలు నడవలేక పోతున్నారు. మా పిల్లలు అక్కడకు వెళ్లలేమని అంటున్నారు. అధికారులు స్పందించాలి.

రోడ్డు, ఫెన్సింగ్ లేని చెరువుతో భయపడుతున్నాం.. ★★★

గెద్దం సుధారాణి, విద్యార్థి కీర్తన తల్లి



ఇక్కడ నుంచి పిల్లలకు మెయిన్ స్కూల్‌కు పంపించాలంటే భయమేస్తోంది. కోడేరు - తాడేపల్లిగూడెం రోడ్డు గుండా అనేక వాహనాలు వెళ్తుంటాయి. పిల్లలు వెళ్లి వచ్చేటప్పుడు ప్రమాదకరం. దీనికితోడు పక్కనే పెన్సింగ్ లేని చెరువు ఉంది. అధికారులు దయతో మా పాఠశాలలోనే పిల్లలు ఉండేట్టు చర్యలు తీసుకోవాలి.



స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అంత దూరం పిల్లల్ని పంపం.. ★★★

నేకూరి చంద్రరావు, విద్యార్థులు బాల సింధు, కార్తిక్ తండ్రి



ఈ ఏక పక్ష విలీనం వల్ల మూడు రోజులుగా పనులు మానుకొని పిల్లల వెంట తిరుగుతున్నాం. అంత దూరం పిల్లలను పంపడం మాకు ఇష్టం లేదు. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించాలి.

సమస్యను పైఅధికారులకు చెబుతాం

ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు

ఎల్ఇ పాఠశాల విద్యా కమిటీ చేసిన తీర్మానం మేరకు ఇక్కడ నుంచి 24 మంది విద్యార్థులను 100 మీటర్ల దూరంలో ఉన్న మెయిన్ పాఠశాలలో పంపించాం. ఇక్కడ పిల్లలు ముందు ఆ పాఠశాలకు వెళ్లారు. తర్వాత వెళ్లకుండా పాత పాఠశాలలోనే ఉండిపోతున్నారు. సమస్యను పైఅధికారులకు విన్నవిస్తాం.

కార్మికులను పర్మినెంట్ చేయాలని సమ్మె

ప్రజాశక్తి - తణుకు

ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (తణుకు మున్సిపాల్టీ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ (జెఎసి) ఆధ్వర్యంలో తణుకు మున్సిపాల్టీ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలపై సమ్మె నిర్వహించారు. ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజకుమార్ మాట్లాడుతూ అత్యవసర విభాగాలైన నీటి సరఫరా, వీధి దీపాలు, డ్రెయినేజీ, పార్కులు, మెకానిక్‌ల, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అన్ని విభాగాల వారికి టెక్నికల్‌కు రూ.29,200, నాన్ టెక్నికల్‌కు రూ.24,500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10 సంవత్సరాలపై బడిన ఇంజినీరింగ్ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ఉపాధ్యక్షులు పి.శ్రీదేవి, ఉప ప్రధాన కార్యదర్శి పి.దానం, కోశాధికారి పి.పెద్దిరాజు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

23 నుంచి మున్సిపల్ సిబ్బంది సమ్మెబాట

నరసాపురం: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ శుక్రవారం మున్సిపల్ ఇంజినీరింగ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది కొద్దిరోజుల నుంచి ఆందోళన చేస్తున్న విషయం విదితమే. ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో సోమవారం నుంచి సమ్మెబాట పట్టనున్నారు. దీనికి సంబంధించి సమ్మె నోటీసును శుక్రవారం ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, ఛైర్‌పర్సన్ బర్రె వెంకట రమణకు అందజేశారు. సోమవారం నుంచి కార్యాలయం ఎదుట టెంట్ వేసి నిరవధిక దీక్ష చేపడతామని జెఎసి నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కె.రత్నం, ఫణి, సత్యనారాయణ, పారు, వెంకటకృష్ణ, బ్రహ్మాజీ, రామకృష్ణ, మధు, అను, రాజు, శ్రీమ, కాశీ పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు జి.జోసఫ్ కిషోర్ మాట్లాడుతూ సొంత మండలంలో ఉద్యోగం చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. తమ ఆరేళ్ల సర్వీసులో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, గతంలో లేని నిబంధనలను ప్రభుత్వం అమలు పర్చడం న్యాయం కాదన్నారు. సీనియర్ అసిస్టెంట్ ప్లేస్కేల్, జాబ్ చాట్ అమలు, ప్రమోషన్లు, మదర్ డిపార్టెంట్లు, అంతర్ జిల్లాల వంటి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందజేశారు. పి.మదన్మోహన్, సిహెచ్.విజయసుధ, బాలచంద్ర, కె.లక్ష్మణరావు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

యువ నాయకులు కనుమూరి భరత్

ఉండి : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని యువ నాయకులు కనుమూరి భరత్ అన్నారు. శుక్రవారం ఉండి మండలం కలిసిపూడి గ్రామంలో జయ మహాలక్ష్మి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి గ్రామ అధ్యక్షులు నల్లారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉండి ప్రధాన పంట కాలువ వెంబడి మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్న కనుమూరి భరత్ మాట్లాడుతూ భావితరాలకు స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను అందించాలంటే ఇప్పటినుండే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని సూచించారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన నల్లారి వెంకటేశ్వరరావు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, ఉప సర్పంచ్ మంతెన చంటిరాజు, గ్రామ తెలుగు మహిళా అధ్యక్షురాలు మంతెన రమాదేవి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

'యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం'

కాళ్ల : యోగా సాధనతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి ఆలోచనలు పెరుగుతాయని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలోని మోడల్ ప్రైమరీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యోగాంధ్ర కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ఉన్నత భారత అభియాన్(యుబిఎ), పీపుల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇన్నర్ ఇంజినీరింగ్(పిఎఐఇ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌కెఆర్ యుబిఎ కోఆర్డినేటర్ డాక్టర్ మెహర్ గణేష్, ఎస్ఆర్‌కెఆర్ యుబిఎ కోఆర్డినేటర్ డాక్టర్ టి.రాంబాబు, యోగా ట్రైనర్ పి.రమేష్ రాజు, డాక్టర్ ఆర్.సుబ్బారావు, డాక్టర్ రఘురాం, డాక్టర్ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : యోగాంధ్ర కార్యక్రమాన్ని గ్రామాల వారీగా నిర్వహించే ప్రణాళికలో భాగంగా అందరూ పాల్గొనాలని కృషిచేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎం.ప్రభాకర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి అధికారులతో యోగాంధ్ర సమీక్ష కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, ఇఒపిఆర్‌డి వెంకటేష్, హౌసింగ్ డిఇ వెంకట్రావు, ఎంఇఒలు హనుమ, పిఎంకె జ్యోతి పాల్గొన్నారు.

ఆకివీడు : అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న రాష్ట్రంలోని విశాఖపట్టణంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమం మనకు గర్వకారణమని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పీడీ వేణుగోపాల్ అన్నారు. మండలంలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ సుహాసిని, వెలుర్తి ఎడి జె.మల్లేశ్వరరావు, గ్రామ పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మొగల్తూరు : యోగా డే విజయవంతం చేయాలని డ్వామా డిపిఒ పి.సుజాత సూచించారు. మొగల్తూరులోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన సుజాత మాట్లాడారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎస్ఐ జి.వాసు, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, పంచాయతీ సచివాలయ కార్యదర్శులు హాజరయ్యారు.

పెనుగొండ : ప్రతినిత్యం యోగా సాధన చేయడం వల్ల అనేక శారీరక, మానసిక రోగాలను దూరం చేయవచ్చని తహశీల్దార్ అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో తహశీల్దార్ అనిత కుమారి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, రెవెన్యూ గ్రామ సర్పంచ్ శ్యామలా సోనీ శాస్త్రి పాల్గొన్నారు.

ఆచంట : యోగాంధ్ర కాంపెయిన్‌లో రిజిస్టర్ అయిన వారికి యోగాలో ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ ఆదేశించారు. ఎంపిడిఒ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎంపిడిఒ బి.కృష్ణమోహన్, ప్రత్యేక అధికారి పిచ్చయ్య, తహశీల్దార్ జి.కనకరాజు, ఇతర మండల అధికారులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

కొల్లేపర రామారావు అనారోగ్యంతో మృతి

ఆచంట : కొడమంచిలి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లేపర రామారావు(91) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు కలరు. ఈయన 1983 సంవత్సరంలో ఆచంట మండల మొట్టమొదటి ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. చిన్నమల్లం గ్రామ రైతు సంఘం అధ్యక్షునిగా నాలుగు దశాబ్దాలు పాటు ప్రజలకు సేవలు అందించి అందరి మన్నలు పొందారు. ఆర్యవైశ్య సంఘం ఆచంట మండలం గౌరవ అధ్యక్షులుగాను, గౌరవ సలహాదారులుగాను పనిచేశారు. 2005 సంవత్సరంలో తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో పాల్గొని తిరు ముచ్చ అవార్డును అందుకున్నారు. ఆయన వృత్తిపట్ల కొడమంచిలి వర్తక సంఘం ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. పలువురు నివాళులర్పించారు.

అత్తమామలు, భర్త వేధింపులపై కొనసాగిన దీక్ష

నరసాపురం: మండలంలోని పాత నవరసపురం గ్రామంలో అత్తమామలు, భర్త వేధింపులపై ఆందోళన చేస్తున్న బర్రె దుర్గా భవాని మూడవ రోజు శుక్రవారం కూడా దీక్షను కొనసాగించారు. భర్త ఇంటి ముందే కట్టు బట్టలతో బైటాయించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అమెకు పలువురు మహిళలు సంఘీభావం తెలిపారు. శుక్రవారం దీక్ష చేస్తున్న దుర్గా భవానిను ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ ఎం.సూర్య ప్రభ వచ్చి మాట్లాడారు. దుర్గా భవాని, వారి కుటుంబ సభ్యులు నుంచి వివరాలు సేకరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆకివీడు : స్థానిక సిద్ధాపురం రైల్వే గేట్ సమీపంలో గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మరణించాడు. మృతుడు స్థానిక సమతా నగర్‌కు చెందిన షేక్ నజీర్(35)గా గుర్తించారు. విజయవాడ వైపు నుండి భీమవరం వైపు వెళ్లే గూడ్స్ రైలు వస్తుండగా అదే పట్టాలను దాటి మార్కెట్ వైపు నుంచి సిద్ధాపురం వైపు వెళ్లాడు. నజీర్‌కి చెవి వినికిడి సమస్య ఉందని అక్కడ స్థానికులు అంటున్నారు. ఆ కారణంగా రైలుకూత వినపడి ఉండకపోవచ్చు అని, ఆ పరిస్థితిలో రైలు ఢీకొని ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్‌పిఎఫ్ కె.రఘురామయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వారణాసిలో వేంపాడు వాసుల ఆత్మహత్య

కాళ్ల : వారణాసిలో మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన వీరమల్లు గంగారావు(75), అప్పయమ్మ(70) ఆత్మహత్య చేసుకున్నారు. గురువారం వారణాసిలో పుణ్య క్షేత్రాలకు వెళ్లిన ఆ వృద్ధులు అక్కడే చనిపోవాలని నిర్ణయించుకున్నారు. పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. దీనిపై వారణాసి పోలీసులు భీమవరం డిఎస్‌పికి తెలియజేశారు. అనంతరం కాళ్ల పోలీసులు బంధువులకు శుక్రవారం సమాచారం అందించారు. దీంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. శుక్రవారం నాడు వేంపాడు నుంచి వారణాసి వెళ్లారు.

తల్లిదండ్రులపై కొడుకు కత్తితో దాడి

భీమవరం టౌన్ : మద్యానికి బానిసైన కొడుకు తన తల్లిదండ్రులను కత్తితో విచక్షణ రాహిత్యంగా దాడి చేసిన సంఘటన మండలంలోని నాగేంద్రపురం గ్రామంలో చోటుచేసుకుంది. నాగేంద్రపురం గ్రామానికి చెందిన నాగిడి గోవిందరాజు మందుకు బానిస అయ్యాడు. దీంతో అతని భార్య కూడా గోవిందరాజును వదిలేసి వెళ్లిపోయింది. అప్పటినుండి గోవిందరాజు ఏ పని చేయకుండా తల్లిదండ్రులు గణపతి, లక్ష్మీలకు వచ్చే పెన్షన్ పైనే ఆధారపడి బతుకుతున్నాడు. అయితే శుక్రవారం తెల్లవారుజామున ఫుల్లుగా మందు తాగి వచ్చిన గోవిందరాజు మరోసారి మద్యానికి డబ్బులు ఇవ్వాలని తండ్రిపై ఒత్తిడి తెచ్చాడు. అయినప్పటికీ గణపతి డబ్బులు ఇవ్వకపోవడంతో ఇంట్లో ఉన్న కత్తితో తల్లిదండ్రులపై విచక్షణ రాహిత్యంగా దాడి చేశాడు. నిందితుడు గోవిందరాజును అదుపులోకి తీసుకున్నామని భీమవరం డిఎస్‌పి వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకొల్లు : పాలకొల్లు యడ్లబజార్ సెంటర్ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం మేడపాడు వైపు నుంచి పాలకొల్లు పెద్ద గోపురం వైపు వెళుతున్న కాజ గ్రామానికి చెందిన సత్తినీడి వీరన్న(69)ను అదే రూట్‌లో వెళుతున్న లారీ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ కేసును సిఐ కె.రజనీ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

యువకుల అరెస్టు

భీమవరం టౌన్ : భీమవరంలో నారాయణ కాలేజ్ విద్యార్థిపై దాడిచేసిన ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు భీమవరం డిఎస్‌పి ఆర్.జయ సూర్య తెలిపారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి వడ్డాది సాయి, కొత్త చరణ్ కుమార్, బొలిశెట్టి వేణుగోపాల్‌ను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. అయితే గురువారం మావుళ్లమ్మ జాతర జరిగిందని, ఇదే సమయంలో స్కూల్ బస్ వెళ్లడంతో ఆకతాయిలు అత్యుత్సాహం ప్రదర్శించి స్టూడెంట్‌ను కొట్టడం జరిగిందన్నారు. దీనిపై స్టూడెంట్ ఫిర్యాదు మేరకు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పనితీరుకు రెవెన్యూ నిలువుటద్దం

పలుచోట్ల 'రెవెన్యూ డే'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ పనితీరు మంచిగా ఉండాలంటే అందుకు రెవెన్యూ పనితీరే నిలువుటద్దంగా ఉంటుందని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి ప్రజల్లో భయాందోళన పెంచిందని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి ప్రజలకు, రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డయాలసిస్ సెంటర్లో వసతులు పరిశీలించి ఎసి సరిగ్గా పనిచేయకపోవడంతో వెంటనే బాగు చేయించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, కూటమి నాయకులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బడుగు పెద్ద, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.తాతారావు పాల్గొన్నారు.

రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పడాల వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భాను ముఖ్యఅతిథిగా పాల్గొని వృద్ధులకు స్వయంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కాళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, విఆర్ఒల సంఘ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

ఆచంట : వేగవంతమైన సేవలను అందించేందుకు రెవెన్యూ ఎంతో ఉపయోగపడుతుందని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. ఆచంట తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విశ్రాంతి రెవెన్యూ అధికారులు కె.సాంబశివరావు, బి.ప్రతాపరావులను తహశీల్దార్ జి.కనకరాజు ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



తాడేపల్లిగూడెం: రోగులకు పండ్లు అందజేస్తున్న ఎంఎల్ఎ

మెరుగైన పాలన అందించేందుకు రెవెన్యూ డే ఒక మంచి అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగులు చేస్తున్న చిన్న చిన్న తప్పులను అధిగమించడానికి, వేగవంతమైన సేవలను అందించేందుకు రెవెన్యూ ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ ఉద్యోగులందరూ పారదర్శకమైన పాలన అందించి రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఉద్బోధించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఆర్ఐ జయలలిత, విఆర్ఒలు సీతారాం, మిరియాల శేషగిరి, సూర్యనారాయణ, నాగేశ్వరరావు, కృష్ణమోహన్, గ్రామ రెవెన్యూ అధికారులు, విలేజ్ సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : శతాబ్దాల తరబడి రెవెన్యూ వ్యవస్థ కొనసాగడం భారతీయ రైతు విధానంలో ప్రధాన భాగమని, అందరికీ ఆధారభూతంగా గెలిచిందని తహశీల్దార్ నండూరు వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ డే సందర్భంగా తహశీల్దార్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ తహశీల్దార్ సావిత్రిని సన్మానించారు. కార్యక్రమంలో విఆర్ఒలు, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు నిరంతరం సేవలందించడం జరుగుతుందని మండల తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. రెనెన్యూ డే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం విశ్రాంతి రెవెన్యూ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉండి మండల డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, విఆర్ఒలు, విఆర్ఎలు పాల్గొన్నారు.

పాలకొల్లు : రెవెన్యూ డే సందర్భంగా పాలకొల్లు తహశీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిని సత్కరించారు. తహశీల్దార్ వై.దుర్గా కిషోర్ సారధ్యంలో సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ వీర పోతన, రిటైర్డ్ విఆర్ఒలు, ప్రస్తుతం పనిచేస్తున్న విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి వ్యక్తి జన్మించిన దగ్గర నుండి రెవెన్యూ సేవలు అందుతున్నాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ అన్నారు. మొగల్తూరులోని మండల రెవెన్యూ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహశీల్దార్ మాట్లాడారు. ధ్రువపత్రాల జారీ, భూముల రక్షణ, రెవెన్యూ శాఖ ద్వారా అందే సేవలను ఆయన వివరించారు. అనంతరం ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని మాట్లాడారు. అనంతరం విశ్రాంత గ్రామ రెవెన్యూ అధికారి నారపరాజు వెంకట భాస్కర కృష్ణమూర్తి(క్రిష్టప్ప)ను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఇఒ యూత్ శామ్యూల్ జాన్, డిటి సంధ్యా, రెవెన్యూ శాఖల అధికారులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర: ప్రజలందరూ రెవెన్యూ శాఖ అందించే సేవలను పొందాలని తహశీల్దార్ వై. రవికుమార్ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగవిరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ ఎస్.కృపావరం, అటెండర్ పి.వెంకట స్వామి లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి నాయకులు బులి రామిరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

తణుకు : రెవెన్యూ డే సందర్భంగా తణుకు తహశీల్దార్ అశోక్‌వర్మ ఆధ్వర్యాన రెవెన్యూ సర్వీసులను, రికార్డులను, అకౌంట్స్, రెవెన్యూ శాఖ మంజూరు ధ్రువపత్రాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా అశోక్‌వర్మ మాట్లాడారు. అనంతరం ఉద్యోగవిరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఎన్.శ్రీదేవి, పి.గౌతమి, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రై డే పాటిద్దాం

మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం : పరిసరాల పరిశుభ్రత పాటించుట ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చు అని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణ ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలోని 33, 34, 35, 32, 31, 30వ వార్డులలో జరుగుతున్న ఫ్రై డే డ్రై డే, వెక్టర్ కంట్రోల్ హైజని కార్యక్రమాలను మలేరియా మాసోత్సవాలలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీటినిల్వలు లేకుండా చేసుకొని వారానికొకసారి ఫ్రై డే డ్రై డే పాటించినట్లయితే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, చిన్నఒఎ, కృపమ్మ, కనకరత్నం, రాజేశ్వరి, ఆరోగ్య సహాయకులు ఇ.కాంత రావు, అంగన్వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ

నరసాపురం : యర్రంశెట్టివారి పాలెం హై స్కూల్‌లో శ్రీసర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర పథకం ద్వారా ప్రభుత్వ హై స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, షూలు, సాక్స్, బెల్టులు వంటి అవసరమైన విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగ ముత్యమాంబ బాబులుచే శుక్రవారం విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి నాగ ముత్యమాంబ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉత్తమ వసతులు కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఛైర్మన్ కోనప్పరెడ్డి రాధాకృష్ణ, ఎంఎంసి మాజీ వైస్ ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, హెడ్మాస్టర్ కోలపతి శ్రీనివాసరావు, సచివాలయం సెక్రటరీ కె.రఘురాం పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు 28వ వార్డులోని జివిఎస్‌వి ఆర్‌ఎం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌కు మానవతావాది, పారిశ్రామికవేత్త పాటపళ్ల నాగదుర్గ వరప్రసాద్ సౌజన్యంతో విద్యా సామాగ్రి కిట్స్ 1, 2వ తరగతి పిల్లలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ దాతలు అందిస్తున్న సహకారంతో విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలని, అభ్యసన కృత్యాలు సాధించాలని కోరారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి, పిల్లలకు ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, మధు, లీలా కుమారి, నందిని పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : అన్నిదానాల కెల్లా విద్యాదానం ఎంతో గొప్పదని, మూడు జిల్లాలోని పేద విద్యార్థులకు లక్ష 50 వేల పుస్తకాలను ఉచితంగా అందించడం గొప్ప విశేషమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష 50 వేల నోటు పుస్తకాలను విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్, జనసేన నాయకులు బ్యాంక్ బాబీ, కొప్పినిడి శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

104 సేవలు వినియోగించుకోవాలి

పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షేక్ చవీర్

పెనుమంట్ర : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరోగ్యం సంరక్షణకు ప్రజలకు వైద్య సేవలు విస్తరించడం జరిగిందని మార్టేరు పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ షేక్ చవీర్ అన్నారు. శుక్రవారం నెగ్గిపూడి శివారు వానంపల్లిలో వైద్య సేవలు అందించారు. 104 వాహనం ద్వారా గ్రామాలలో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇక్కడ 50 మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎఎన్‌ఎం మాధవి, ఎంఎల్‌హెచ్ పి.సంధ్య రామకృష్ణ, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభ జయప్రదం చేయండి

భీమవరం : కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో ఈనెల 27 నుంచి 30 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, బి.గణేష్ అన్నారు. భీమవరం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం 55 ఏళ్ల గా అలుపెరుగని పోరాటం నిర్వహిస్తూ ఎస్ఎఫ్ఐ ముందుకు పోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గోవింద్, పట్టణ నాయకులు కె.రోహిత్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే : సిఐటియు

వీరవాసరం : కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో భాగంగా గురువారం మత్స్యపురి గ్రామంలో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్లను తీసుకురావడం పరిశ్రమ అధిపతులకు కార్పొరేట్లకు ఉద్యోగ కార్మికులను తాకట్టు పెట్టడమేనని అన్నారు. లేబర్ కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్తేరు భారతి, కళ్యాణి, శిరీష, అన్నపూర్ణ, రాణి పాల్గొన్నారు.

సాగు, తాగునీరు తక్షణమే విడుదల చేయాలి

ప్రజాసంఘాల నేతలు

పెంటపాడు : సాగునీరు, తాగునీరు తక్షణమే విడుదల చేయాలని ప్రజాసంఘాల నేతలు కోరారు. శుక్రవారం ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలనుద్దేశించి సిపిఎం మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, కర్రి సాయిరెడ్డి మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీన నీటిపారుదల అధికారులు, ప్రజాప్రతినిధులు కాల్వలకు నీరు విడుదల చేశారని, 20 రోజులు కావస్తున్నా కొన్ని కాల్వలకు నీటి విడుదల కాలేదని, కొన్ని కాల్వలకు తక్కువ నీటి మట్టంతో ప్రవహిస్తున్నాయని వారు తెలిపారు. ప్రభుత్వం మాత్రం ముందస్తుగా సాగునీరు విడుదల చేసామని, వ్యవసాయ పనులు ముమ్మరం చేయాలని ప్రకటించిందని, అయినా కాలవులకు నీటిమట్టం పెరగక వ్యవసాయ పనులకు అనుకూలంగా లేదని వారు తెలిపారు. ఒకపక్క గ్రామాల్లో మంచినీళ్ల చెరువులు అడుగంటుకుపోయాయని, తాగడానికి కూడా నీరు లేక కొనుక్కునే పరిస్థితి గ్రామాల్లో ఏర్పడిందని వారు వాపోయారు. ప్రభుత్వం ముందస్తుగా టెండర్లకు పిలిచి కాలువలకు ఆధునీకరణ పనులు మొదలు పెట్టకుండా.. లేటుగా మొదలు పెట్టడం వల్ల కాలువలకు నీటి విడుదల రాలేదని వారు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో నీరు విడుదల చేయాలని, ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు అందించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గ, దత్తు రాము, బర్ల బాలాజీ, మీసాల శ్రీను, తెర్లి రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి మహాప్రభో

ప్రభుత్వ కాలనీ వాసుల మొర

ఉండి : ప్రభుత్వ కాలనీలో ఉన్న సమస్యలను తీర్చండి మహాప్రభు అని పెద్ద పుల్లేరు ప్రభుత్వ కాలనీవాసులు కనుమూరి భరత్ వద్ద మొరపెట్టుకున్నారు. శుక్రవారం మండలంలోని పెదపుల్లేరులో పర్యటించిన స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు తనయుడు కనుమూరి భరత్ వద్ద కాలనీవాసులు సమస్యల ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ మాజీ మంత్రి కలిదిండి రామచంద్ర రాజు హయాంలో పెదపుల్లేరు గ్రామంలో నిరుపేదలకు ఇచ్చిన భూములను గత తహశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి స్వాధీనం చేసుకుని సెంటున్నర చొప్పున తిరిగి నిరుపేదలకు పంపిణీ చేశారని, కానీ కాలనీలో సమస్యలు తీర్చేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించకుండా గాలికి వదిలేసారని అన్నారు. అప్పట్లో ఇక్కడ ఇల్లు నిర్మించుకున్న నిరుపేదలు తమకు మౌలిక వసతులు కల్పించాలని పోరాటాలు చేసినప్పటికీ గత ప్రభుత్వం స్పందించలేదని కనుమూరి భరత్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కనుమూరి భరత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని నిరుపేదలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ కాలనీలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు సహకారంతో నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, స్థానిక నాయకులు కలిదిండి శ్రీనుబాబు, కరణం వెంకటేశ్వరరావు, పాటూరి మోహన్, మడక సురేష్, కాలనీవాసులు, అధికారులు ఉన్నారు.

యోగాంధ్ర సరే.. వేతన బకాయిల సంగతేంటి?

వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు

తణుకు : యోగా ఆంధ్ర సరే.. కూలీలకు చెల్లించవలసిన ఉపాధి వేతన బకాయిల సంగతి ఏమిటని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఇరగవరం మండలం సూరంపూడి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ మోడీకి మాటిచ్చాను, అందుకు యోగా విజయవంతం కావాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఈ రాష్ట్రంలో ఉన్న ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచి వేతనాలు పెంచుతామని, కూలీల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినా ఇచ్చిన హామీ అమలు చేయడానికి ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. యోగా నిర్వహించడంపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ఉపాధి కూలీలకు చెల్లించవలసిన వేతన బకాయిలపై ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో 2005 నుంచి అమలవుతున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేదలకు దూరం చేయడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను కూలీలందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు అంకరాణి, బొల్లా మౌనిక, మట్టా వెంకటలక్ష్మి, పద్మ, ఆరేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు అభినందన

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ పరిశోధనా స్థానం లో పనిచేస్తున్న ఎనిమిది మంది శాస్త్రవేత్తలకు ఉద్యోగోన్నతులు వచ్చిన సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం వారికి ఫారం సెమినార్ హాల్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ టి.శ్రీనివాస్‌తో పాటుగా డాక్టర్ బి.సహదేవరెడ్డి(పంటల యాజమాన్య విభాగం), డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ పి.రాధిక (కీటకశాస్త్ర విభాగం) వారికి సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతి పొందారు. ఒకే స్థానం నుంచి ఇంత మంది సీనియర్ ప్రొఫెసర్లుగా ఉద్యోగోన్నతి పొందడం ఇదే మొదటిసారి. అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ ఎం.గిరిజా రాణి(మొక్కల ప్రజనన విభాగం) ప్రొఫెస్సర్‌గా ఉగ్యోగోన్నతి పొందగా, డాక్టర్ వై.సునీత(మొక్కల ప్రజనన విభాగం) అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి సాధించారు. ఇతర శాస్త్రవేత్తలైన డాక్టర్ పివి.రమేష్‌బాబు(పంటల యాజమాన్య విభాగం), డాక్టర్ వి.రోజా(మొక్కల ప్రజనన విభాగం) అసిస్టెంట్ ప్రొఫెసర్ సీనియర్ స్కేల్‌కి ఎంపిక చేయబడ్డారు. ఇంతమంది సిబ్బందికి ఒకేసారి ఉద్యోగోన్నతులు రావడం ఇక్కడ పనిచేస్తున్న శాస్త్రవేత్తల కృషికి, కష్టానికి తగిన ప్రతిఫలమని సహ పరిశోధనా సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు.

'భూ దందా అక్రమాలు అరికట్టాలి'

నరసాపురం: వేములదీవి పడమర గొందిమూల గ్రామంలోని మామిడిశెట్టి ఏడుకొండలు, మామిడిశెట్టి రామాంజనేయులు అను వారి భూమి 600/3లో 0-08 సెంట్ల భూమిని అదే గ్రామానికి సెందిన కవురు తాతయ్య, ముత్యాలు అను అతను అక్రమంగా రెండున్నర సెంట్ల భూమిని అతని కొడుకులు కవురు ఆంజనేయులు, కవురు బోగేశ్వరరావు పేరున రాసారని బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు మామిడిశెట్టి రామాంజనేయులు, ఏడుకొండలు మాట్లాడుతూ అక్రమంగా భూమి రాయించుకున్న వ్యక్తులు గ్రామంలో భూమి మాదని ప్రచారం చేయడంతో అనుమానం వచ్చి డాక్యుమెంట్ నకళ్లు తీయించామన్నారు. ఇందులో మా భూమిలో రెండున్నర సెంట్లు అక్రమంగా రాయించుకున్నట్లు తేలిందన్నారు. ఈ సమస్యపై మా భూమిని ఏ ఆధారాలతో వారికి రిజిస్ట్రేషన్ చేశారని నరసాపురం సబ్ రిజిస్ట్రార్‌కి లెటర్ పెట్టామన్నారు. దీంతో ఆయన గ్రామ రెవెన్యూ అధికారిని వివరణ అడగగా అక్రమంగా రాయించుకున్నది రెండున్నర సెంట్లు అయితే. రెవెన్యూ అధికారి అక్రమంగా భూమి రాయించుకున్న వ్యక్తులు ఐదున్నర సెంట్ల భూమిలో స్వాధీనంలో ఉన్నారని ధృవీకరిస్తూ రిజిస్ట్రార్‌కి తప్పుడు ఉత్తర్వులు ఇచ్చారని, న్యాయం చేయాలని ఆర్‌డిఒకి వినతిని అందజేశారు.

పూడికతీత పనులు ప్రారంభం

నరసాపురం: మండలంలోని రుస్తుంబాదలో ఉన్న మురుగు డ్రెయిన్లలో పూడికతీత పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ హాజరయ్యారు. అనంతరం స్ప్రేయర్‌తో గడ్డి మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాలువలు, డ్రెయిన్లు ప్రక్షాళన పనులు చేపట్టామని ఆయన అన్నారు. వాటిని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా డెల్టా వైస్ ఛైర్మన్ గుబ్బల మారాజు, బందేల రవీంద్ర, గంటా కృష్ణ, పట్టిప్రోలు సతీష్ పాల్గొన్నారు.

నాగ మాధుర్‌కు సత్కారం

నరసాపురం : ఇటీవల నేపాల్‌లో జరిగిన ఇండో-నేపాల్ క్రికెట్ ఛాంపియన్ షిప్-2025 పోటీల్లో అండర్-19 కేటగిరిలో పాల్గొని గ్రామానికి విచ్చేసిన నాగ మాధుర్‌ను శుక్రవారం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు ఘనంగా సత్కరించారు. మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన నాగ మధుర్ విశాఖ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 పోటీల్లో ఎపి తరుపున నేపాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. ఆర్థిక సోమత లేని ఈ క్రీడాకారుడికి పట్టణ, మండలానికి చెందిన పోలిశెట్టి శ్రీనివాస్, పలువురు క్రీడాభిమానులు, దాతలు సహకరించి నేపాల్ పంపారు. అక్కడ విజయం సాధించి గ్రామానికి విచ్చేసిన మాధుర్‌ను గ్రామస్థులు సత్కరించారు. కార్యక్రమంలో బండారు పటేల్ నాయుడు, అయితం చందు, ఈదా సురేష్, పులపర్తి శ్రీధర్ పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

మొగల్తూరు : రామన్నపాలెం పంచాయతీ లక్కువారి తోట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.బుజ్జిబాబు శుక్రవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సర్పంచి బందులే ఎలీషా, విద్యార్థులు, తల్లిదండ్రులు పలువురు గ్రామస్తులు బుజ్జిబాబును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గన్న బత్తుల లక్ష్మణరావు, గ్రామస్తులు బల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.